మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?

M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com

సంప్రదించండి



# మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి
## ఉత్తరాంధ్ర జిల్లాలు

శుక్రవారం | 26 | జూన్ | 2026 | పేజీలు : 10


# రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, సీపీ



**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఈ నెల 30న విశాఖపట్నంలో జరగనున్న భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం సాయంత్రం నోవాటెల్ హోటల్‌లో పరిశీలించారు. విజయనగరంలో ఉన్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ



2వ పేజీలో

## దక్షిణ నియోజకవర్గ పరిధిలో రెండేళ్లలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశాం : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


2వ పేజీలో

**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్ తెలిపారు. గురువారం జీవీఎంసీ దక్షిణ జోన్ పరిధి లోని 37వ వార్డులో సుమారు రూ. 69.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న నాలుగు

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : అదనపు ఎస్పీ కెవి రమణ

### నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ



2వ పేజీలో

**శ్రీకాకుళం / ఎచ్చెర్ల , జూన్ 25 ( మనం న్యూస్ ) :** కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ అభియాన్"

## రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ , జూన్ 25 ( మనం న్యూస్ ) :** పార్లమెంట్ భవనంలో గురువారం రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సమక్షంలో ఆయన ప్రమాణం చేసి, అధికారికంగా తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్రానికి చెందిన యువ నాయకుడు ప్రతిష్టాత్మక పెద్దల సభలో అడుగుపెట్టడం పట్ల పార్టీ శ్రేణులు, ఆయన అభిమానుల్లో పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో, ప్రజా సమస్యలను


2వ పేజీలో

## జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా వై. శృతి బాధ్యతల స్వీకరణ

### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అదనపు ఎస్ పి

**ఏఎస్ఆర్ జిల్లా పాడేరు , జూన్ 25 ( మనం న్యూస్ ) :** జిల్లా నూతనంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా వై. శృతి బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం ఉదయం జిల్లా నిషాంతి.టి వారిని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్ లో ఆమె మర్యాద పూర్వ కంగా కలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేప ట్టిన అదనపు ఎస్పీ, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి భేటీలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ శాఖ పరంగా చేపట్టాల్సిన పరిపాలనా పరమైన అంశాలపై వారు కాసేపు చర్చించారు.



# రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, సీపీ

**ఒకటి తరువాయి**

కార్యక్రమం జరగనున్న నోవాటెల్‌లోని వీ-కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, సీపీ కార్యక్రమ నిర్వహణ, ప్రోటోకాల్, భద్రత, వాహనాల పార్కింగ్, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, అత్యవసర సేవలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రపతి భద్రత, ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రీన్ రూమ్ ల ఏర్పాటు, అతిథులు ఉండేందుకు ప్రత్యేక వసతి, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్న నేపథ్యంలో సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏర్పాట్ల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మిశ్రా, ఇతర ఆచార్యులు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్లు బీవీ రమణ, మధుసూదనరావు, డీసీపీలు లతామాధురి, మణికంఠ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్...**

భారత రాష్ట్రపతి జూన్ 30వ తేదీన ఉదయం న్యూఢిల్లీ నుంచి భారత వైమానిక దళ ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నానికి విశాఖపట్టణంలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అనంతరం నేరుగా నోవాటెల్ లోని వీ-కన్వెన్షన్ సెంటర్లో జరిగే స్నాతకోత్సవ వేడుక వద్దకు చేరుకుంటారు. ఇక్కడ సాయంత్రం 3.00 నుంచి 4.00 గంటల వరకు జరిగే సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం ఆమె ఐఎన్ఎస్ డేగాకు, అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు బయలుదేరుతారు. రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ఇతర రాష్ట్ర మంత్రులు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు.

# రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ ప్రమాణ స్వీకారం

**ఒకటి తరువాయి**



జాతీయ స్థాయిలో ప్రస్తావించడంలో పార్లమెంట్ వేదికగా ఆయన తన గళాన్ని బలంగా వినిపిస్తారని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ రాజ్యసభ ఎంపీగా బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖులు, కార్యకర్తలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : అదనపు ఎస్పీ కెవి రమణ



**ఒకటి తరువాయి**

లో భాగంగా జూన్ 17 నుండి జూన్ 26 వరకు 10 రోజుల పాటు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి గారు ఆదేశాలు మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వారోత్సవాలు (నషా ముక్త్ భారత్ సప్తాహ్) అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏచర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కె.వి. రమణ పాల్గొని మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించుకొని, ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని కోరారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమానాస్పద మాదకద్రవ్యాల కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జె ఆర్ పురం ఇన్స్పెక్టర్ ఎం అవతారం, ఎచ్చెర్ల ఎస్సై లక్ష్మణరావు,కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గ పరిధిలో రెండేళ్లలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశాం : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**ఒకటి తరువాయి**

అభివృద్ధి పనులకు ఎంపీ శ్భరత్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ ఇంచార్జి సుధాకర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, పెయిన్ దొర పేట, చెంగలరావుపేట, రెల్లివీధి ప్రాంతాల్లో అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణంతో పాటు కొత్త అగ్రహారం ప్రవేశ ద్వారం (ఎంట్రన్స్ ఆర్చ్) నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నగర ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలను మత్స్యకార గ్రామాల ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో గత రెండేళ్లలో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డు వారీగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో 13 ప్రవేశ ద్వారాల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు.. నగరంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో నగర స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం బిటుమిన్ (తారు) కొరత ఏర్పడిందని, దీంతో కొన్ని బిటుమిన్ రోడ్ల నిర్మాణ పనుల్లో స్వల్ప జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులపై ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దక్షిణ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నరసింహా సదన్ సత్రంలో భక్తుల సౌకర్యాలపై ఆకస్మిక తనిఖీ



**సింహాచలం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు గురువారం దేవస్థానం ఇంచార్జి పర్యవేక్షణాధికారి మూలవాసు తో కలిసి నరసింహ సదన్ సత్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నరసింహ సదన్‌లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ల పనితీరును పరిశీలించారు.

భక్తులు వాటిని సక్రమంగా వినియోగిస్తున్నారా, మిషన్ల ద్వారా అందుతున్న సేవలపై ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను భక్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మరింత సులభంగా, వేగవంతంగా సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం భక్తులకు కేటాయిస్తున్న గదులను పరిశీలించి, వాటి నిర్వహణ, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల స్థితిగతులను తనిఖీ చేశారు. గదులలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టిన చర్యలను పర్యవేక్షణాధికారి మూలవాసు కార్యనిర్వహణాధికారికి వివరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, సింహాచలం విచ్చేసే భక్తులకు ఉత్తమ వసతి సౌకర్యాలు అందించడం దేవస్థానం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నరసింహ సదన్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రత, సేవల నాణ్యత, సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు దేవస్థానం నిరంతరం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత

**నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ నిషాంతి. టి**



**అల్లూరి జిల్లా పాడేరు , జూన్ 25 ( మనం న్యూస్ ) :** జిల్లాలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిషాంతి. టి అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏఆర్ఓస్, ఏ ఇఆర్ఓస్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమాజంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తక్కువ స్థాయిలో పూర్తయిందని పేర్కొన్న ఆమె, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటికీ ఫారాల పంపిణీతో పాటు ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించి, ఫారాల పూరణలో సహకారం అందించాలని తెలిపారు. పూర్తి చేసిన ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 2002 ఓటరు జాబితాను ఆధారంగా తీసుకుని వివరాలను సరిచూసి, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చాలని ఆదేశించారు. మరణించినవారుజాబితా లో ఉన్న,ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు అయిన వారు, గుర్తింపు వివరాలు అందుబాటులో లేని ఓటర్ల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి అపోహలకు తావులేకుండా వ్యవహరించాలని సూచించారు. మేపింగ్ చేసే విషయంలో బిఎల్ఓ ఒకటికి రెండుసార్లు సరిచూసి మ్యాపింగ్ చేయాలని జిల్లాలో చేర్పించేసినప్పుడు ఎక్కువ శాతం తప్పు లు ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని అలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తిగా భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న అధికారిక కార్యక్రమమని, రాజకీయ జోక్యానికి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా రెవెన్యూ అధికారి ఏం వి ఎస్ లోకేశ్వరరావు,ఆర్డిఓ భుజంగరావు,11 మండలల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వామ్మో చీడికాడలో టిఫిన్.!!!?

- పాసిపోయిన ఇడ్లీ. నాణ్యత లేని చట్నీ..
- పట్టించుకోని ఫుడ్ ఇన్స్పెక్టర్లు. ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు...!?
- ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అయోమయంలో ప్రజలు.!?





**అనకాపల్లి,/ చీడికాడ , జూన్ 25 ( మనం న్యూస్ ) :** తెల్లవారితే చాలు ప్రతి ఒక్కరూ టిఫిన్ చేసేందుకు శ్రద్ధ చూపుతారు. టిఫిన్ ఎక్కడ బాగుంటుంది చట్నీ ఎక్కడ బాగుంటుంది అని మరీ విచారించి పరుగులు తీస్తారు. నాణ్యత తో టిఫిన్ తయారు చేసే చోటు ఏ మారుమూలన ఉన్న పరుగులు తీసే ప్రస్తుత సమాజంలో అందుకు విరుద్ధంగా ఒక మండల కేంద్రంలో నాణ్యత లేకుండా పాచిపోయిన ఇడ్లీ పెడుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. గ్రామీణ ప్రాంతాల్లోని మండల కేంద్రాల్లో హోటల్లు టిఫిన్ సెంటర్లు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ నాణ్యతను పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారే గాని చర్యలు తీసుకోవడం లేదనడానికి నిదర్శనాలు ఎన్నో. అనకాపల్లి జిల్లా చీడికాడ మండల కేంద్రంలో అక్షర శ్రీ విద్యానికేతన్ సమీపానగల సాయిరాం టిఫిన్ సెంటర్లో టిఫిన్ నాణ్యత లేదని, ఈరోజు మిగిలిపోయిన ఇడ్లీని ఫ్రిజ్లో దాసి మరుసటి రోజు వేడి చేసి వినియోగదారులకు పెడుతున్నారని వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యుడు లెక్కల గోవింద్ ఆరోపించారు. గురువారం తాను వికలాంగుడిని కావడంతో ఒకరితో టిఫిన్ తెప్పించుకున్నానని అది పాచిపోయి ఉందని తినలేకపోయానని. గతంలో కూడా రెండు మూడు సార్లు ఇలానే జరిగిందని ఆ విషయం షాపు యజమానులకు చెప్పడం జరిగిందని ఆయన విలేకరులకు తెలిపారు. గతంలో కొన్నాళ్లు ఎంపీడీవో ఆఫీసు ఎదురుగా తాను టిఫిన్ సెంటర్ నడిపానని టిఫిన్ సంగతి తనకు తెలుసని క్వాలిటీ అన్నది ఎలా ఉంటుందో తనకు తెలుసని అటువంటిది పాచిపోయిన ఇడ్లీ ని పెట్టి ఈరోజే పెట్టానని బుకాయించడం వెనుక ఆంతర్యం అంత చిక్కడం లేదన్నారు. మండల కేంద్రంలో హోటల్లో నాణ్యతలే ఉండడం లేదని టిఫిన్ సెంటర్లో మరి దారుణంగా ఉన్నాయని. చేపలు మాంసం దుకాణాల్లో కొలతలు కూడా సరిగా ఉండటం లేదని దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తనకు ఇచ్చిన పాచిపోయిన ఇడ్లీని తీసుకొని యజమాని వద్ద అడిగితే పక్కనున్న తాజా మాజీ సర్పంచ్ కొడుకుతో తనకు అనుకూలంగా చెప్పించుకోవడమే కాకుండా తనపై తిరుగుబాటు చేసేందుకు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో హోటల్లు టిఫిన్ సెంటర్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు అధికంగా ఉన్న ఫుడ్ ఇన్స్పెక్టర్లు ఎప్పుడు వచ్చిన దాఖలు లేవని పరీక్షించిన సంఘటనలు కూడా కనిపించడం లేదని ఆయన తెలిపారు. ఎప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి హోటల్లో టిఫిన్ సెంటర్లను ఫుడ్ ఇన్స్పెక్టర్లు తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం పర్యటన

**జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం. అన్నపూర్ణమ్మ**




**విజయనగరం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 27వ తేదీ (శుక్రవారం) విజయనగరం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం. అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకురావచ్చని ఆమె తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరై అవసరమైన నివేదికలు, వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

**పర్యటన వివరాలు:**

ఉదయం 10.00 గంటలకు గంట్యాడ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గంట్యాడ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గంట్యాడ మండలంలో భూసంబంధిత ఫిర్యాదులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. సాయంత్రం 5.00 గంటల నుంచి 6.00 గంటల వరకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, అక్కడి వసతులను పరిశీలిస్తారని ఆమె వివరించారు.

# దేవరాపల్లి రైతులకు నూతన వరి వంగడాల పంపిణీ

## సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు



**దేవరాపల్లి , జూన్ 25 ( మనం న్యూస్ ) :** దేవరాపల్లి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వేదికగా గురువారం కూటమి నాయకులు రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే నూతన, అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందజేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.కొత్త రకాల విత్తనాలను రైతులకు అందజేశారు. తెగుళ్లను తట్టుకుని, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే రకాలుగా వ్యవసాయ అధికారులు వివరించారు.వర్షాలు ప్రారంభానికి ముందే విత్తనాలు అందడంతో నారుమడులు, దుక్కి పనులు సమయానికి మొదలుపెట్టే అవకాశం కలిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 50% సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసిందని నాయకులు తెలిపారు. ఎకరాకు 30 కిలోల చొప్పున రైతులకు కేటాయించారు.విత్తన పంపిణీతో పాటు కొత్త వంగడాల సాగు విధానం, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఉయ్యాల చింతగడ్డ నీటి సంఘం చైర్మన్ గుల్లిపల్లి మురళీకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు అల్లు అబద్ధం, సబ్బవరపు మాలిబాబు, స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో మంచి దిగుబడులు సాధిస్తామని రైతులు ధీమా వ్యక్తం చేశారు.

# నవ వధువు అనుమానాస్పద మృతి



**మధురవాడ / భీమునిపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** పీఎంపాలెం పోలీసుస్టేషన్ పరిధి ఆర్ హెచ్ కాలనీలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెళ్ళైన 40 రోజులకే నవ వధువు యాండ్రాపు కృష్ణవేణి (25) అనుమానాస్పదస్థితిలో ఉరి వేసుకుని మృతి చెందింది. విజయనగరం జిల్లా మెంటాడ ప్రాంతానికి చెందిన దగ్గర బంధువైన యాండ్రాపు మురళీతో ఈ ఏడాది మే 13వ తేదీన కృష్ణ వేణికి వివాహమైంది. మురళీ ఓ కంపెనీ లో పనిచేస్తుండగా, కృష్ణవేణి గోపాల పట్నం ప్రాంతంలోని షాప్ లో పనిచేస్తున్నారు. కొత్తగా పెళ్ల యిన వీరు గత 20 రోజులుగా పీఎంపాలెంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మురళీ బుధవారం ఉదయం డ్యూటీ నుండి రాత్రి ఇంటికి తిరిగొచ్చేసరికి ఆమె ఫ్యాన్కు ఉరేసుకుని విగ తజీవిగా కనిపించింది. దీంతో మురళీ స్థానిక పోలీసులకు సమాచారమందించారు. వెంటనే ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకర..

# మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను వాహనదారులు వినియోగించుకోవాలి

## రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** విశాఖ నగర పరిధిలో రోడ్లపై వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి ప్రజలకు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలోని 29వ వార్డు జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌సీపీ)ను పరిశీలించారు. పార్కింగ్ నిర్వహణ, వాహనాల రాకపోకలు, వినియోగదారుల వివరాలను సంబంధిత కార్ పార్కింగ్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వాహనాల రద్దీని తగ్గించడం, ప్రజలకు సౌకర్యవంతమైన పార్కింగ్ సదుపాయం కల్పించడం లక్ష్యంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ద్వారా నిధులు వెచ్చించి అధునాతన సదుపాయాలతో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు, వ్యాపార సంస్థలు తమ వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేయకుండా అందుబాటులో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రోడ్లపై అస్తవ్యస్తమైన పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటమే కాకుండా పాదచారులు, రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగుతుందని అన్నారు. ఇకపై సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై అక్రమంగా, అసౌకర్యంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి సంబంధిత వారికి జరిమానాలు విధిస్తూ తగిన చర్యలు పోలీసువారి సహకారంతో తీసుకోవడం జరుగుతుందన్నారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో ప్రతిరోజు ఎన్ని వాహనాలు పార్కింగ్ అవుతున్నాయి, ఏ ప్రాంతాల నుంచి వాహనదారులు వినియోగిస్తున్నారనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎం ఎల్ సి పి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాతో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన వాహనాలను గమనించి ,ఎం ఎల్ సి పి సదుపాయాన్ని వినియోగించేలా వాహనదారులకు సూచిస్తూ అవగాహన కల్పించాలని నిర్వాహకులకు కమిషనర్ ఆదేశించారు. ఈ విషయమై, విశాఖ పోలీస్ కమిషనర్‌తో నేరుగా ఫోన్లో మాట్లాడి మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రజలు వినియోగించుకునేందుకు రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు ట్రాఫిక్ పోలీస్ ద్వారా నియంత్రణ చర్యలు తీసుకొని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం సమీప ప్రాంతాల్లోని ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతూ రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్‌లను గమనించినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ స్థానికులకు సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్వాహకులు, వార్డ్ ఎమ్యూనిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# హాజరత్ ఇషాక్ మదని ఔలియా కు చాదర్ సమర్పణ



**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** వన్ టౌన్ ప్రాంతం, కోటవీధి లో వున్న అతి పురాతన మైన హాజరత్ ఇషాక్ మదని ఔలియా దర్గా 769 వ ఉత్సవం పురస్కరించుకొని పలువురు వై ఎస్ ఆర్ సిపి ముస్లిం మైనార్టీ నేతలు హాజరత్ ఇషాక్ మదని ఔలియా దర్గాను దర్శించుకున్నారు. వై ఎస్ ఆర్ సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఐ హెచ్ ఫరూకి, వై ఎస్ ఆర్ సీపీ విశాఖ జిల్లా మైనార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బర్కత్ అలి, విశాఖ జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్,మరియు వై ఎస్ ఆర్ సీపీ మైనారిటీ సెల్ స్టేట్ జెనరల్ సెక్రటరీ కే వి బాబా, రాష్ట్ర యువజన అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, వై ఎస్ ఆర్ సీపీ వార్డు అధ్యక్షులు షౌకత్ అలి,వై ఎస్ ఆర్ సీపీ 39వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్, వై ఎస్ ఆర్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ సెక్రటరీ నిజాం (కరీం), వైస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకులు బాష తదితరులు విచ్చేసి హాజరత్ ఇషాక్ మదని ఔలియా వారి మజార్ పై సందల్ పూసి,పవిత్ర చాదర్ కప్పి, గులాబి పుష్పాలు సమర్పించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం, అల్లాహ్ ను ప్రార్థించారు. ఈ సందర్భంగా బర్కత్ అలి మాట్లాడుతు తన సొంత నిధులతో గత ఐదు నెలల నుండి దర్గా అభివృద్ధి, మరమత్తులు చేపడుతున్నానని తెలిపారు.

ఈ మేరకు దర్గా కమిటీ సభ్యులు లతీఫ్, ఎస్ కె అహమ్మద్, అసిఫ్, హబీబ్ వై ఎస్ ఆర్ సీపీ మైనార్టీ నేతలకు శాలువ కప్పి ఘనంగా (గుల్ ఫోషి) సత్కరించారు.

## అడ్డదారులు వద్దు భవిష్యత్తే ముద్దు : సీఐ వినోద్ బాబు

**పాయకరావుపేట , జూన్ 25 ( మనం న్యూస్ ) :** యువత అడ్డదారులు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని భవిష్యత్తు తీర్చిదిద్దుకున్నందుకు సన్మార్గాన్ని ఎంచుకోవాలని సిఐ వినోద్ బాబు సూచించారు. స్థానిక కార్తికేయ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గంజాయి వ్యసనాలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలు మరియు పోక్సో చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాయకరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ యం. వినోద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ అనేది జీవితానికి ఎంతో కీలకమైనదని, ఈ సమయంలో క్షణికావేశంలో లేదా స్నేహితుల ప్రభావంతో తప్పుడు మార్గాల్లోకి వెళ్లవద్దని సూచించారు.?సదస్సులోని ముఖ్యమైన అంశాలు ఒ హెచ్చరికలు: గంజాయి / మత్తు పదార్థాల నియంత్రణ: గంజాయి వంటి మాదకద్రవ్యాల అలవాటు జీవితాలను నాశనం చేస్తుందని, వీటి రవాణా లేదా వినియోగంలో దొరికితే కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోతారని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత: ఆన్‌లైన్ మోసాలు, లోన్ యాప్స్, తెలియని లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాల న్నారు. మహిళల రక్షణ - పోక్సో చట్టం: మహిళలు, బాలికల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, బాలికలపై జరిగే వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం కింద జీవిత ఖైదు వరకు శిక్షలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని లేదా 100 / 112 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. "విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలన్నారు.

# మాదకద్రవ్యాలే మన శత్రువు

### కలిసి పోరాడదాం సిపి శంఖబ్రత బాగ్చి పిలుపు : జెసిఐ వైజాగ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ప్రపంచాన్ని పీడిస్తున్న మాదకద్రవ్యాలే మన శత్రువు అని వాటి వాడకం, రవాణాకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గురువారం విశాఖ బీచ్ రోడ్ లో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వైజాగ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ సమాజంలో వివిధ కారణాల వల్ల యువకులు మాదకద్రవ్యాల వాడకానికి బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అటువంటి వారిని గుర్తించి వారిలో పరివర్తన తీసుకురావాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం మూలంగా నేరాల శాతం పెరుగుతుందని దీన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వాడకం, రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉన్నట్లయితే ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుండి పార్కు హోటల్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర జరిగిన వాక్‌థాన్ ను సిపి ప్రారంభించి చివరి వరకు హుషారుగా నడిచి యువకులను ఉత్సాహపరిచారు. జెసిఐ సభ్యులతో పాటు సుమారు 200 మంది




మిస్సెస్ ఏ.వి.ఎన్. కళాశాల విద్యార్థులు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు, యువకులతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

ఈ కార్యక్రమంలో జెసిఐ ఇండియా జోన్ ఫోర్ ప్రెసిడెంట్ చైతన్య వసంతవాడ, జెసిఐ వైజాగ్ ప్రెసిడెంట్ టి.రవీంద్ర, సెక్రటరీ యు. గాయత్రి, ప్రాజెక్టు చైర్పర్సన్ దిలీప్ కుమార్, జోన్ మెంటర్ కెవి రావు, వైస్ ప్రెసిడెం ట్ కె.ఎం.కె. రమేష్, ఈశ్వర్ సాయి, భాను, మౌళి, భరత్, చందు, జోన్ ఆఫీసర్స్ పి. కిరణ్, భార్గవ్, హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ సీఈవో వై.రఘురాజు, ఏవియన్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ గాయత్రి, అర్చన, వైజాగ్ ఫిలిం సొసైటీ ప్రతినిధులు చిన్నారావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లి వ్యాధిపై ఉచిత వైద్య శిబిరం

**భీమునిపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ప్రపంచ బొల్లి వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా భీమిలి, మధువాడ ప్రాంతాలలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వైద్య కళాశాల మరియు ఆసుపత్రి చర్మవ్యాధుల విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య మరియు అవగాహన శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో సుమారు 200 మంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) చర్మవ్యాధి చర్మవ్యాధుల విభాగాధిపతి డాక్టర్ ప్రొఫెసర్ రాహుల్ రే మాట్లాడుతూ బొల్లి (విటిలిగో) అనేది ఎంతమాత్రం అంటువ్యాధి కాదని స్పష్టం చేశారు. అయినప్పటికి ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో 50 శాతం నుండి 60 శాతం మంది తీవ్రమైన సామాజిక వివక్షను సమాజంలో



ఎదురయ్యే హేళనలను మరియు మానసిక వేదనను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. గురువారం జరిగిన వైద్యశిబిరాలలో విటిలిగో (బొల్లి మచ్చలు) ఉన్న రోగులకు ఉచిత వైద్య సంప్రదింపులతో పాటు అవసరమైన పరిశోధన పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలు, ప్రతి రోగి శరీర పరిస్థితికి అనుగుణంగా అధునాతన చికిత్సా విధానాలపై ప్రత్యేక సలహలు మరియు చికిత్సలు అందించారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా గీతం ఆసుపత్రి వైద్య నిపుణులు బొల్లి వ్యాధిపై ప్రజలకు శాస్త్రీయమైన అవగాహనను కల్పిస్తూ, రోగుల పట్ల సానుభూతితో కూడిన దృక్పథాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.

## జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలో ఎం.ధార్మిక ప్రజ్ఞశ్రీ కి ద్వితీయ స్థానం

**భీమునిపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలో ఎం.ధార్మిక ప్రజ్ఞశ్రీ కి ద్వితీయ స్థానం లభించింది. విశాఖపట్నం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ - 2026 పోటీలలో జిల్లాస్థాయి ఎంపికలు జూన్ 19 నుంచి 22 వరకు స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం, విశాఖపట్నంలో నిర్వహించబడినవి. ఈ ఎంపికల్లో ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్ మూడవ తరగతి విద్యార్థిని ఎం.ధార్మిక ప్రజ్ఞశ్రీ ద్వితీయ స్థానం పొందినది. ఈ సందర్భంగా సన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాస్ అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా పాల్గొని మంచి ఫలితాలను సాధించాలని తెలియజేశారు.



## నర్సీపట్నంలో భారీ ట్రాఫిక్ జామ్..బారీగా నిలిచిన వాహనాలు

**నర్సీపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** నర్సీపట్నం పట్టణంలోని శ్రీ కన్య జంక్షన్ వద్ద గురువారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో డ్రైనేజీ పనులు కొనసాగుతుండటంతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించడం తో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు పెద్ద సంఖ్యలో రోడ్డుపై నిలిచిపోయాయి. నలుగురు పోలీస్ సిబ్బంది ఆ ప్రాంతాలో విధులు నిర్వహిస్తున్న సరే ట్రాఫిక్ నియంత్రణ కు చేపట్టిన వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది... అయితే వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ పూర్తిగా సాధారణ స్థితికి చేరుకోవడానికి కనీసం గంటల సమయం పట్టే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర పనుల కోసం ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు సూచించారు.

## అధిక వర్షాలతో పంటల నష్టం



**లావేరు , జూన్ 25 ( మనం న్యూస్ ) :**ఏడాది అధిక వర్షాలు వల్ల తొలకరి పంటలు అధికంగా నష్టపోవడం జరిగింది దీంతో రైతులు ఆవేదనకు గురయ్యారు మండలంలో సుమారుగా 55 హెక్టార్లో పత్తి జొన్న వాటర్ మిలన్ పంటలను అధికంగా రైతులు వ్యవసాయ సాగు చేయడం జరిగింది అకాల వర్షాలు వలన పంటలన్నీ దెబ్బతిన్నాయి వాతావరణం అనుకూలించకపోతే రైతుకి ఎప్పుడూ కష్టాలే తప్ప సుఖపడేది లేదని రైతులు ఆరోపిస్తున్నారు నష్టపోయిన పంటలకి ప్రభుత్వం రైతుకు వెన్నంటి ఉండి కొంతమేరకు ఆర్థిక సహాయ సహకారం అందిస్తే బాగుంటుందని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు దీనిపై ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు

# నిరుద్యోగ యువత మెగాజాబ్ మేళా వినియోగించుకోండి : జడ్పిటిసి గాడు వెంకటప్పడు

**భీమునిపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని జెడ్పిటిసి గాడు వెంకటప్పడు కోరారు. ఈ సందర్భంగా సింగనంబంధ స్వర్ణ సచివాలయం లో కూటమి నాయకులు ఆధ్వర్యంలో గోడ పత్రిక ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి గాడు వెంకటప్పుడు మాట్లాడుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి మెగా జాబ్ మేళా లో 10 నుండి పీజీ వరకు, టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులు ఉపాధి పొందవచ్చని అన్నారు. పలు ప్రముఖ కంపెనీలను మన భీమిలి తీసుకువచ్చి యువత ఉద్యోగాలు పొందేలా మన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కృషి చేస్తున్నారన్నారు. ఈ జాబ్ మేళా ఈనెల 30వ తేదీన ఉదయం 8:30 నుండి సాయంత్రం 5:30 వరకు పోతనమల్లయ్యపాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నటువంటి



మెగా జాబ్ మేళా తక్షణమే తమ పేర్లు నమోదు చేసుకుని 30 న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగనబంద గ్రామ మాజీ సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మజ్జి వలస పిఎసిఎస్ చైర్మన్ గుడ్డాల ఎల్లయ్య, కాళ్ళ అప్పలరాజు, కరుబక్త సన్నిబాబు, కాళ్ల అప్పలరాజు మరియు సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 244 మంది పోలీసులకు రివార్డులు : పోలీసు కమీషనర్

**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, క్రైమ్ రివ్యూ సమావేశంలో గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 244 మందికి రివార్డ్ మంజూరు ఆర్డరును అందజేశారు.నగర పోలీసు శాఖ నందు హోంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గా గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తగు రివార్డులు అందజేసి, వారు సమర్ధవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకున్న విషయం విధితమే.గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో,





చోరీ కాబడిన సొత్తు,ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 244 మంది, హోం గార్డు నుండి సీ.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా ఈ రోజు క్రైమ్ మీటింగ్ కు నందు నగర పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును అందజేశారు.

# గాజువాక బారీ గణపతి మహోత్సవానికి కర్ర పూజ

**గాజువాక , జూన్ 25 ( మనం న్యూస్ ) :** శ్రీనగర్ డీమార్ట్ ప్రక్కన ఉన్న మైదానంలో గాజువాక గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ గణేష్ ఆధ్వర్యంలో కర్ర పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి వరసింగరావు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోర్చనలతో రాట పూజ చేసి , నవ రత్నాలు, నవ ధాన్యాలు వేసి ,మండపం రాట వేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల తొలి పూజ వినాయక చవితిని గాజువాకలో గణేష్ ఉత్సవ కమిటీ వారు గత ఐదు సంవత్సరాలుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. దీని ద్వారా ఎంతో మంది కళాకారులకు , పూజ సామగ్రి అమ్మే వారికి ఉపాధి లభించిందని అన్నారు. బారీ గణపతి పూజా కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 14 న వినాయక చవితి రోజు నుంచి దర్శనాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు



గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ

**విశాఖపట్నం, జూన్ 25 ( మనం న్యూస్ ) :** రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన 8 మందికి 50, వేల రూపాయలు చొప్పున 4,00,000/- పరిహారం గురువారం అందజేశారు.విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా, బాధితులకు, పరిహారం అందే వరకు, కావలసిన, సహాయం అందజేయడం జరుగుతున్నది. ఈ సహాయక కేంద్రం తీసు కున్న చర్యల ఫలితంగా, విశాఖపట్నం సిటీ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసులో యాక్సిడెంట్ లో గాయపడిన బమ్మిడి. పద్మ, బిల్లల వలస, మెరక మొడిదాం. మండలం, విజయనగరం జిల్లా, అను ఆమెకు 50,000/- రూపాయలు, విశాఖపట్నం సిటీ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన బొంతల కోటి .రవితేజ . దుర్గా నగర్, హెచ్ బి కాలనీ, విశాఖపట్నం సిటీ, అని వారికి 50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో , హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన విశాఖపట్నం సిటీ మద్రిపాలెం, కి చెందిన హనుమంతు. సుజాత కి ,50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పీఎం పాలెం ,పోలీస్ స్టేషన్ ,పరిధిలో జరిగిన హిట్ అండ్ కేసులో గాయపడిన శ్రీ గుర్ల.నూకరాజు 30 . గుమ్మిడివానిపాలెం గ్రామం, ఆనందపురం మండలం ,విశాఖపట్నం సిటీ ,అను వారికి 50 వేల, రూపాయలు,విశాఖపట్నం సిటీ, ఎంవిపి పోలీస్ స్టేషన్, పరిధిలో జరిగిన ,హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులో గాయపడిన బొడ్డేటి. పద్మ కొత్త వెంకోజీ పాలెం విశాఖపట్నం సిటీ , అను ఆమెకు,50 వేల రూపాయలు, విశాఖపట్నం సిటీ, ఆరిలోవ పోలీస్ స్టేషన్, పరిధిలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన గుంట .రాధా 38. దుర్గాపురం , ఎన్ఏడి జంక్షన్. విశాఖపట్నం సిటీ , అను ఆమెకు 50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులో గాయపడిన చుక్క .హరికృష్ణ గణేశ్ నగర్, సబ్బవరం మండలం, అనకాపల్లి జిల్లా, అను వారికి 50 వేల రూపాయలు, విశాఖపట్నం సిటీ, పెందుర్తి పోలీస్ స్టేషన్, పరిధిలో హిట్ అండ్ కేసులో గాయపడిన, జామి.సన్నిబాబు, దుర్గా నగర్, పెందుర్తి మండలం, విశాఖపట్నం సిటీ,అను వారికి, 50,000/- (యాభై వేల రూపాయలు) మొత్తం ఎనిమిది మందికి, 50వేల రూపాయలు చొప్పున 4,00000/- (నాలుగు లక్షల రూపాయలు ) వారి యొక్క బ్యాంకు ఖాతాకు, నేరుగా నగదు జమ చేయిశీచడం జరిగిందన్నారు. ఇంతవరకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఇట్ ఆండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో ఇప్పటివరకు 28 మంది మృతుల కుటుంబాల కు, 56,00,000/- ( యాబై ఆరు లక్షల, రూపాయలు, ) గాయపడిన 130 మందికి 65 ,00,000/- (అరవై ఐదు లక్షల, రూపాయలు,) మొత్తం 158 మంది బాధితులకు రూ. 1,21, 00,000/- (అక్షరాల ఒక కోటి, ఇరవై ఒక లక్షల రూపాయలు)పరిహారం అందజేయడం జరిగింది. ఈ కేసుల్లో , పరిహారం కోసం, దరఖాస్తు చేయదలచిన బాధితులు, ఎవరైనా సహాయం కొరకు, విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆఫీస్, గ్రౌండ్ ఫ్లోర్ లో ఏర్పాటు చేసిన "రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం," నందు గాని , లేదా టోల్ ఫ్రీ నెంబర్ 7995095793 కి గాని సంప్రదించగలరు.

# శివాలయం నిర్మాణానికి శంఖుస్థాపన

- డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం
- తన సొంత నిధులతో ఆలయ నిర్మాణం
- పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు
- వైభవోపేతంగా అల్లిపురం నేరెళ్ల కొనేరులో కార్యక్రమం నిర్వహణ



**విశాఖ , జూన్ 25 ( మనం న్యూస్ ) :** విశాఖ 32 వ వార్డు అల్లిపురం నేరెళ్ల కోనేరు ప్రాంతంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు సొంత నిధులతో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి గురువారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, వాస్తు పూజా కార్యక్రమాలను అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ శ్రీ పార్వతి పరమేశ్వరుల అనుగ్రహముతో, శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో శివాలయం నిర్మాణం చేయాలనే తన చిరకాల కోరిక నేటితో నిజం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, స్థానిక పెద్దల సమక్షంలో శివాలయం నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. పెద్దా పురం నుంచి వచ్చిన శిల్పి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఆయన కూడా శివ భక్తులు కావడం విశేషమన్నారు. నాలుగు నెలల్లో ఈ ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేతున్నట్లు చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా, శక్తివంతంగా ఈ శంఖుస్థాపన కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పుణ్య నదుల నుంచి గంగ ను తీసుకురావడం జరిగిందన్నారు. నవధాన్యాలు, నవ రత్నాలతో యంత్ర ప్రతిష్ట చేసి ఈ శంఖుస్థాపన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఆ శివ పార్వతుల ఆశీస్సులు, శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహముతో తన పరిధి మేరకు ప్రజాలకు సేవ చేస్తున్నట్లు వెల్లడించారు. అమ్మవారి దేవస్థానానికి తనను చైర్మన్ గా నియమించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు , అలాగే దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. పవన్ కళ్యాణ్ స్పూర్తితో తాను మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ 32వ వార్డు అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారని చెప్పారు.తాను చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఆయన సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలనేది తన ఆకాంక్ష అన్నారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీపెట్టారని, అధికారం కోసం మాత్రం కాదని అన్నారు. తన సొంత నిధులతో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్ కొనియడబడుతున్నారని తెలిపారు. నేడు డిప్యూటీ సిఎంగా రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు కుటుంబ సభ్యులు నళిని దేవి, కేధర్నాధ్, బదిరీనాధ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులను గౌరవిస్తూ చదవాలి..ఉన్నత శిఖరాలకు వెళ్ళాం

### ఇంటర్మీడియట్ రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ కర్రీ అనిత, ముఖ్యఅతిథి లోళ్ళ రాజేష్

**విశాఖ , జూన్ 25 ( మనం న్యూస్ ) :** గత విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఫలితాలలో కమిటీ పట్టణానికి చెందిన కళ్యాణి కాలేజ్ విద్యార్థిని కర్రి అనిత 470 మార్కులకు 468 కవచం చేసుకుని రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకర్ గా నిలిచినందుకు కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో కరస్పాండెంట్ రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో చిరు సత్కారాన్ని గురువారం సాయంకాలం నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ లాల్ రాజేష్ మాట్లాడుతూ ఒక ఫిషర్ మాన్ గ్రామంలో పుట్టి వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన కర్రీ అనిత నామమాత్రపు వసతులతో జీవించి నేడు రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ గా నిలిచినందుకు ప్రతి ఒక్క విద్యార్థికి స్పూర్తిదాయకం కావాలని ఆమె యొక్క నిత్యజీవితంలో జీవనశైలి అనిత చదివే విధానం



ఆమె నడవడిక ఉపాధ్యాయుల పై ఆమెకు ఉన్న మక్కువ వంటి వల్ల రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకర్ గా నిలిచానని తెలియజేశారు. అనిత ను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకొని మీరు కూడా ఇంకా ఉన్నత శిఖరాలకు వెళ్లాలని రాజేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి అనిత మాట్లాడుతూ మొదటి రోజు నుంచి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదివినచో ప్రతి ఒక్క విద్యార్థి తప్పకుండా మొదటి ర్యాంకులో నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి ఏవో రాణి డైరెక్టర్ రమేష్ తో పాటు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# బూత్ స్థాయి ఏజెంట్లకు గుర్తింపు కార్డుల పంపిణీ




**పద్మనాభం , జూన్ 25 ( మనం న్యూస్ ):** పద్మనాభం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బంగ్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన కుమార్తె సిరమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. జాబితా పరిశీలన, సవరణ కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన పెంపొందించాలని సూచించారు. సిరమ్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏజెంట్ల సేవలను అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత ను వివరిస్తూ, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని బూత్ స్థాయి ఏజెంట్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు, సామాజిక మాధ్యమ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా సువర్ణావకాశం

**ఆనందపురం , జూన్ 25 ( మనం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యువ నాయకుడు గంటా రవితేజ సహకారంతో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆనందపురం మండలం వేములవలస సచివాలయంలో గురువారం మెగా జాబ్ మేళా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్, బ్యాంకింగ్, రిటైల్, తయారీ రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల




30వ తేదీన ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పోతినమల్లయ్యపాలెంలోని సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళా పోస్టర్‌లో ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ముందస్తుగా నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని నిరుద్యోగ యువతకు సూచించారు. అనంతరం జాబ్ మేళాపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిప్రతిభ పురస్కారాలు 2026

**ముంచంగిపుట్టు , జూన్ 25 ( మనం న్యూస్ ):** గిరిజన బి ఈడి కళాశాల భద్రాచలం లో చదివిన పూర్వవిద్యార్థులు ( ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ ) అల్లూరి జిల్లా లో పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు జిల్లా స్థాయిలోమొదటి,రెండవ,మూడవ 10000,8000,5000 చొప్పున ప్రతి మండల రోపర్ విద్యార్థికి 2000 నగదు మరియు జ్ఞాపిక తో సన్మానించి సత్కరించారు. జిల్లాలో అత్యుత్తమ ఫలితం 100% రిజల్ట్ సాధించిన పాఠశాలగా ముంచంగిపుట్ మండలానికి చెందిన జి టి డబ్ల్యూ ఆశ్రమ పాఠశాల పనసపుట్ బెస్ట్ స్కూల్ అవార్డ్ అందజేశారు. జిల్లా కలెక్టర్ హాజరైన ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ .భారతి బెస్ట్ స్కూల్ అవార్డ్ అందుకున్నరు ఈ కార్య క్రమం లో ముంచంగిపుట్టు మండలం నుంచి భద్రాచలం లో బి ఈడి అభ్యసించి ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జి. కామేశ్వరరావు సిహెచ్. నాగరాజు పడాల, ఆర్.ఆదినారాయణ.కె. సిద్దేశ్వర



రావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 87వ వార్డ్ పాత వడ్లపూడిలో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక వార్షికోత్సవ మహోత్సవములు

## ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్)


**గాజువాక , జూన్ 25 ( మనం న్యూస్ ):** గాజువాక నియోజకవర్గం 87వ పరిధి పాతవడ్లపూడిలో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం జగన్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ముఖ్యంగా మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం సుబ్బయ్యమ్మ గారు సొంత నిధులతో ఈ ఆలయాన్ని నిర్మించారని. ఈ గుడి నిర్వహణ కొరకు తన సొంత నిధులతో చేస్తున్నారని ఆ భగవంతుని ఆశీస్సులు తనకు ఎల్లవేళలా ఉండాలని అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంచారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## రాజ్యసభలో అడుగుపెట్టిన ఏపీ యువనేత చింతకాయల విజయ్

### తెదేపా శ్రేణుల్లో సంబరాలు



**దేవరాపల్లి , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ నాయకుడు చింతకాయల విజయ్ దేశ అత్యున్నత చట్టసభ రాజ్యసభలో సభ్యుడిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాజ్యసభలో అడుగుపెట్టడం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత విజయం కాకుండా రాష్ట్రానికి గౌరవంగా భావిస్తున్నామని పార్టీ నేతలు పేర్కొన్నారు. విజయ్ వంటి యువ నాయకుల ప్రవేశంతో సభలో కొత్త ఆలోచనలు, యువత దృక్కోణం మరింత బలపడుతుందని కూటమి పార్టీల నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రమాణ స్వీకారం అనంతరం రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా అభినందనలు వెల్లువెత్తాయి. మాడుగుల నియోజకవర్గానికి చెందిన దేవరాపల్లి మండల తెదేపా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రావికామతం పార్టీ పరిశీలకుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ఎం. అలమండ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పోతుల నాయుడు ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ ను కలిసి పసుపుగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మాడుగుల నియోజకవర్గం నుండి సోషల్ మీడియా వేదికగా కూటమి నాయకులు, అభిమానులు విజయ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఈ నెల 27న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము

### జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి

**విశాఖపట్టణం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఈనెల 27న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్పర్సన్ అధ్యక్షతన స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరుగు తుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి. నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం 27వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొనసాగుతుందని సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆ ప్రకటన లో కోరారు.

# సాయికృష్ణ లాకప్‌డెత్ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- చంద్రబాబు కులం ఆపాదించడం దారుణం
-:మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్
- సాయికృష్ణ లాకప్‌డెత్‌పై సీబీఐ దర్యాప్తు జరపాలి
- తల్లి, చెల్లి, గొడ్డలి, గుడ్డు అంటూ డైవర్షన్ పాలిటిక్స్
- 'రెడ్ బుక్ రాజ్యాంగం'తో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- గుడివాడ అమర్‌నాథ్



**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** విజయవాడలో సాయికృష్ణ లాకప్ డెత్ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, దానికి సీఎం చంద్రబాబు కులం ఆపాదించడం అత్యంత హేయమని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్ అయ్యారు. లాకప్‌డెత్ వెనక ఎన్నో విషయాలు దాగి ఉన్నాయని, వాస్తవాలన్నీ బయటకు రావాలంటే, ఆ ఘటనపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. లాకప్‌లో ఒక యువకుణ్ని చంపేసి, చివరకు శవం కూడా దొరక్కుండా పోలీసులు కాల్చి బూడిద చేయడం, దేశంలో ఎక్కడా జరిగి ఉండదని స్పష్టం చేశారు. వైఫల్యాలు ప్రశ్నిస్తుంటే ఓర్చుకోలేకపోతున్న ప్రభుత్వ పెద్దలు, తమపై పిచ్చి విమర్శలు, ఆరోపణలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆక్షేపించారు. ప్రెస్‌మీట్‌లో గుడివాడ అమర్‌నాథ్ ఇంకా ఏం మాట్లాడారంటే..:సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం :కర్నూలు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు బుధవారం చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యం. పోలీసులు లాకప్‌లో ఒకరిని దారుణంగా కొట్టి చంపి, చివరకు శవం కూడా దొరక్కుండా కాల్చి బూడిద చేస్తే, ఆ విషయాన్ని ప్రస్తావించని సీఎం.. విజయవాడలో ఒక ఘటన జరిగిందని, అక్కడ సీఐ, బాధితుడు ఇద్దరూ ఒకే కులానికి చెందిన వారని నిస్సిగ్గుగా మాట్లాడారు. పైగా మా పార్టీ ఈ కేసులో కుల రాజకీయం చేస్తోందని సీఎం వ్యాఖ్యానించడం అత్యంత హేయం. వ్యవస్థలను కాపాడాల్సిన సీఎం, అంత పెద్ద ఘటనకు సింపుల్‌గా కులం ఆపాదించి మాట్లాడడం దారుణం. మా పార్టీ అధినేత, మాజీ సీఎం శ్రీ వైయస్ జగన్, ఆ కుటుంబాన్ని పరామర్శించే వరకు, లాకప్‌డెత్ కేసులో ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరించింది. ఆ తర్వాత మొక్కుబడిగా సీఐపై కేసు, అరెస్టు తతంగాన్ని కొనసాగించారు.రాష్ట్రంలో చట్టబద్ధమైన వ్యవస్థ పతనం:లాకప్‌డెత్‌కు గురైన సాయికృష్ణకు క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉందంటూ తప్పుడు వాదనలు తీసుకువస్తున్నారు. 'తప్పు చేస్తే శిక్షించడానికి న్యాయవ్యవస్థ ఉంది. కానీ పోలీసులే చంపేసి బూడిద చేస్తారా? పోలీస్ స్టేషన్‌కు వెళ్తే తిరిగి వస్తామా? లేదా? అనే భయాన్ని ఈ ప్రభుత్వం సృష్టిస్తోంది'. లాకప్‌డెత్‌లో ప్రధాన నిందితుడు సీఐ నాగరాజును కాపాడుతూ, తొలుత అతణ్ని కేవలం వీఆర్‌కు మాత్రమే పంపారు. ఆ తర్వాత ఈ ఘటన తీవ్ర కలకలం రేపడంతో, సస్పెండ్ చేసి, కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కూడా అరెస్టుకు 4 రోజులు తీసుకున్నారు. ఇక సీఐ రిమాండ్ రిపోర్టు అంతా నామమాత్రం. మొత్తం మీద ఈ కేసులో పెద్ద తలకాయలను తప్పిస్తూ, ప్రభుత్వం డ్రామా చేస్తోంది.వారెందుకు నోరు విప్పడం లేదు?:ఎక్కడైనా గంజాయి దొరికినా, చివరకు ఫ్లెక్సీల వద్ద అభిమానంతో జంతుబలి ఇచ్చినా, రయ్‌మంటూ పరుగెత్తుకొచ్చి ప్రెస్‌మీట్లు పెట్టే హోం మంత్రి అనిత, విజయవాడ లాకప్‌డెత్‌పై నోరు విప్పడం లేదు. ప్రశ్నిస్తారనో ఏమో.. కనీసం మీడియా ముందుకు కూడా రావడం లేదు. ఇంకా సకల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేష్ కూడా విజయవాడ లాకప్‌డెత్‌పై నోరెత్తడం లేదు. అందుకు కారణం ఒక్కటే. లాకప్‌డెత్ నిజం. పోలీసులు సాయికృష్ణను చంపేసి, కాల్చి బూడిద చేసింది కూడా నిజం.సీబీఐ దర్యాప్తు జరగాలి. పోలీసులూ ఇకనైనా వైఖరి మార్చుకోండి:కృష్ణ లంక పీఎస్‌లో లాకప్‌డెత్ కేవలం ఒక సీఐ చేసిన హత్య కాదు. అందులో విజయవాడ నగర కమిషనర్, డీజీపీ ప్రమేయం కూడా ఉంది. అందుకే ముందు వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. వారిపైనా కేసు పెట్టి అరెస్టు చేయాలి. ఇంకా ఈ కేసులో వాస్తవాలన్నీ వెలుగులోకి రావాలంటే, వెంటనే సీబీఐతో దర్యాప్తు జరిపించాలి. రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ తెచ్చిన 'రెడ్ బుక్ రాజ్యాంగం' వల్లే పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైంది. అధికారులు చట్టానికి లోబడి పని చేయాలి. రేపటి రోజున మిమ్మల్ని కాపాడటానికి చంద్రబాబు, లోకేష్ రారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఆధికారం లో ఉన్న వారి మాటలు నమ్మి వారు చెప్పినట్లు చేద్దామన్న ఆలోచన పోలీస్ శాఖలో ఎప్పుడైతే వచ్చిందో అప్పటి నుంచి ప్రజలకు పోలీస్ వ్యవస్థ మీద గౌరవం పోయింది. ఆ గౌరవాన్ని తిరిగి నిలబెట్టుకోవడం చిన్న విషయం కాదు.సీసీ కెమెరా ఫుటేజీ ఎలా మాయం?:కృష్ణలంక పీఎస్‌లో సీసీటీవీ ఫుటేజ్ లేదనడం అత్యంత బాధ్యతారాహిత్యం. కేవలం హోంమంత్రి కమిషన్ల కోసమే కోట్లు ఖర్చు పెట్టి కెమెరాలు పెట్టించారా? 70 వేల కెమెరాలు రికార్డు కాకపోతే ఉంటే ఎంత? పోతే ఎంత? ప్రయోజనం లేనప్పుడు కోట్లు ఖర్చు చేయడం ఎందుకు? ఇవన్నీ ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలని, వాటికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని అమర్‌నాథ్ తేల్చి చెప్పారు.

# ఉమ్మడి విశాఖి అనకాపల్లి జిల్లాలో విద్యార్థి గల్లంతు

**ఎస్.రాయవరం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ఎస్.రాయవరం మండలం,బంగారమ్మపాలెంలో ప్రమాదవశాత్తు వరాహ నదిలో విద్యార్థి గల్లంతు, విద్యార్థి అదే గ్రామానికి చెందిన కారే అశోక్ గా గుర్తించిన పోలీసులు. ఎన్.ఏ.ఓ.బి. రెస్క్యూ డైవ్ సిబ్బందితో నీటిలో గాలిస్తున్న పోలీసులు. గల్లంతైన అశోక్ కోసం వరాహ నదిలో నావి అండ్ పోలీసులు గాలింపు బంగారమ్మపాలెం జె డి పి హెచ్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న కారే అశోక్. కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు. స్థానిక మత్స్యకారులతో సైతం గాలింపు చర్యలు

# మాసాంతర రివ్యూ..పోలీస్ స్టేషన్ పనితీరుపై సిపి పర్యవేక్షణ

**విశాఖపట్నం , జూన్ 25 ( మనం న్యూస్ ) :** నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, నగర కాన్ఫరెన్స్ హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీలు నుండి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ఈ నెల రివ్యూ మీటింగ్ లో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు.ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ లకు నిర్వహించిన ఈ నెల రివ్యూ మీటింగ్ నందు ఆయా విభాగాల పనితీరును సీపీ గారు పూర్తిగా సమీక్షించారు.నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్ గా ఉన్న రౌడీ షీటర్లు,వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు, నిన్నటి వరకూ నమోదు చేసిన ఎన్ డి పి ఎస్ కేసు వివరాలను సమీక్షించి, నగరం గుండా ఏటువంటి ఎన్ డి పి ఎస్ రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలని తెలిపారు.నగరంలో పోలీస్ స్టేషన్లో లాంగ్ పెండింగ్ లో ఉన్న కేసులు యొక్క వివరాలు, కేసు పెండింగ్ ఉండడానికి గల కారణాలు తెలుసుకొని సదరు పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించివలసిందిగా ఆదేశించారు, కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ స్టేషన్ పరిధిలో యెటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పూర్తిగా నివారించాలని, ఆయా స్టేషన్ పరిధిలో గల నిర్మానుష్యప్రాంతాలను, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పీకేట్, అవసరం మేరకు డికొయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉండాలనీ, గంజాయి ఎక్కడా ఉండరాదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఏమైనా ఉన్నచో తనకు తెలియజేయాలని తెలిపారు. నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల లో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరు పై ఆరా తీసి, తగు ఆదేశాలు జారీ చేశారు. పోక్సో కేసుల పైన ఆరా



తీశారు, నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలనీ తెలిపారు.విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా లా అ ఆర్డర్ మరియు క్రైమ్ సిబ్బంది అందరూ వినియోగిస్తూ నిందితులను మరింత వేగముగా గుర్తించాలని తెలిపారు.సైబర్ క్రైమ్ పై మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు, ప్రజలకు పూర్తి అవగాహన అయ్యేలా మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు, పలు కొత్త సాఫ్ట్ వేర్ లను తీసుకొని వినియోగించాలని సూచించారు.ఉమెన్ సేఫ్టీ కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల పైన వేదింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసులలో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలన్నారు,పోక్సో కేసుల పైన ఆరా తీశారు.కోర్టు నందు కేసులు ఎటువంటి జాప్యం లేకుండా, కన్విక్షన్ పడే కేసులు సంఖ్య పెరిగే విధముగా చేయుటకు, అధికారులు మరియు సిబ్బంది సందేహాలను నివృత్తి చేసేందుకు లోక్ ఆధాలత్ నందు గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆహ్వానించి పలు న్యాయ సంబంధిత అంశాలపై పరస్పరం చర్చించి, పోలీసు అధికారులు పలు న్యాయ సంబంధిత అంశాలలో తమ సందేహాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ను అడిగి నివృత్తి చేసుకున్నారు.వచ్చే నెల నిర్వహించబోవు రివ్యూ మీటింగ్ నందు ప్రతి పోలీస్ స్టేషన్ గత నెల కంటే మెరుగ్గా, క్రైమ్ తగ్గు ముఖం పట్టే విధముగా పోలీసింగ్ ఉండాలని తెలిపారు.నగర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పూర్తి పారదర్శకముగా తమ విధులు నిర్వర్తించాలని, విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు ఉంటాయనీ తెలిపారు.ఈ సమావేశంలో డి.సి.పి-01(ఎల్ఎ ఓ) వి.ఎన్. మణికంఠ చందోలు, , డి.సి.పి(క్రైమ్స్) లతా మాధురి, డి.సి.పి(అడ్మిన్) సి.హెచ్ పాపా రావు , నగర ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, స్టేషన్ ఎస్.హెచ్.ఓ లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.







## పాకలపాడు గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన



**గొలుగొండ , జూన్ 25 ( మనం న్యూస్ ) :** గొలుగొండ మండలం లో ఈ రోజు నర్సీపట్నం రూరల్ సీఐ మేడం రేవతమ్మ తో కలిసి, గొలుగొండ ఎ రామారావు,గొలుగొండ మండలం పాకలపాడు గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించాము. ఈ సమావేశంలో మాదకద్రవ్యాల నిర్మూలన (ఆంటీడ్రగ్స్ ), సైబర్ నేరాల నివారణ, మహిళలపై జరిగే నేరాల నివారణ, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాము. ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించాము. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్లకు సమాచారం అందించాలని కోరుతున్నాము.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం

**ముంచంగిపుట్టు , జూన్ 25 ( మనం న్యూస్ ) :** అల్లూరిసీతరామరాజు, ముంచంగిపుట్టు మండలం, జర్జుల పంచాయతీ, గుర్రలబయలు గ్రామములో సర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్లను నమోదు చేశారు. ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు చేశారు. మరణించిన లేదా అర్హత లేని వారి పేర్లను తొలగిచారు.

ఓటరు జాబితాను ఖచ్చితంగా మరియు తాజాగా ఉంచుతారు.ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె జాగత్రాయ్, క్లస్టర్ ఇంచార్జ్ బి రామారావు, గ్రామస్తులు, ఓటర్స్ సచివాలయం సిబ్బందులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

### బాధితురాలికి. 2.25 లక్షల పరిహారం

**ముంచంగిపుట్టు , జూన్ 25 ( మనం న్యూస్ ) :** ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో నమోదైన ఒక బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2022లో ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోక్సో కేసు నమోదైంది ఈ కేసులో నిందితుడైన గజ్జంగి కోటేశ్వరరావు (తండ్రి: నారాయణ, వయస్సు: 30 సంవత్సరాలు, గ్రామం: తుస్సాపల్లి, బంగారుమెట్ట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా) పై పోలీసులు పక్కా ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. స్పెషల్ పోక్సో జడ్జి నిందితుడిపై నేరం రుజువు కావడంతో సి ఆర్ పి సి లోని సెక్షన్ 235(2) ప్రకారం ఈ క్రింది శిక్షలు ఖరారు చేశారు:20 సంవత్సరాల కఠిన జైలు శిక్ష. జరిమానా: రూ. 25,000/- జరిమానా విధించారు. ఈ జరిమానా మొత్తంలో రూ. 20,000/- బాధితురాలైన బాలికకు నష్టపరిహారంగా, మిగిలిన రూ. 5,000/- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు. ప్రభుత్వ పరిహారం: వీటితో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధితురాలికి రూ. 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) అదనపు నష్టపరిహారంగా అందించాలని జడ్జి ఆదేశించారు.ఈ కేసులో అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తుషార్ దూడి, అత్యంత ప్రతిభావంతంగా, పకడ్బందీగా విచారణ జరిపి కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాతి రాజశేఖర్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. అలాగే, కోర్టు లైజనింగ్ అధికారి వై. నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ నిరంతరం కేసు విచారణను పర్యవేక్షిస్తూ, సాక్షులను సకాలంలో హాజరుపరిచి నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించారు. మహిళలు బాలికల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, నేరస్థులకు చట్టం ప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జి.మాడుగుల సిఐ ఎస్ లక్ష్మణ్ సూచనలతో ముంచంగిపుట్టు ఎస్సై పి నాని విలేకరులకు వివరించారు.